

రైల్వేలైన్లకు.. మహర్దశ



- ఇప్పటికే గద్వాల- డోర్నకల్ ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి
- కృష్ణా- వికారాబాద్ లైన్ సర్వే పనులకు గ్రీన్ సిగ్నల్
- వచ్చే కేంద్ర బడ్జెట్‌లో నిధులు మంజూరయ్యే అవకాశం
- రెండు రైల్వే ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.7,526 కోట్లు
- దూరాభారం తగ్గడంతో పాటు వ్యాపార, వాణిజ్య అభివృద్ధి
- ఈ రైల్వేలైన్‌లతో పాలమూరు జిల్లాలో పెరుగనున్న కనెక్టివిటీ

మహబూబ్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో చిరకాల కోరికలుగా ఉన్న రెండు రైల్వే లైన్లకు త్వరలో గ్రీన్ సిగ్నల్ రానుంది. ఇప్పటికే గద్వాల, డోర్నకల్ రైల్వే లైన్‌కు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి చేసిన రైల్వేశాఖ.. తాజాగా వికారాబాద్- కృష్ణా రైల్వే లైన్ ఫైనల్ లొకేషన్ సర్వే పనులు ప్రారంభించింది. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే వెనుకబాటులో ఉన్న పాలమూరు జిల్లా వ్యాపారం, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లోనే వీటికి నిధులు కేటాయిస్తారని అనుకున్నప్పటికీ ప్రస్తావన రాలేదు. కానీ ఈ సారి యూనియన్ బడ్జెట్‌లో కచ్చితంగా ఈ రెండు రైల్వే లైన్లతో పాటు రాష్ట్రంలో మొత్తం ఫైనల్ లొకేషన్ సర్వేకు ఆదేశించిన 15 లైన్లకు మహర్దశ రానుంది. వాస్తవానికి రాష్ట్రంలో ఉత్తర, సెంట్రల్ తెలంగాణతో పోల్చితే పాలమూరులో రైల్వే కనెక్టివిటీ చాలా తక్కువగా ఉంది. కేవలం మహబూబ్‌నగర్ నుంచి ఒక రైల్వే లైన్ రాయలసీమవైపు ఉన్నప్పటికీ.. మిగతా జిల్లాకు పెద్దగా కనెక్టివిటీ లేదు. రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉండటంతో ఇక్కడ వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉన్నప్పటికీ.. రవాణా సదుపాయం పెద్ద సమస్యగా మారింది. తాజాగా మంజూరు కానున్న రైల్వే లైన్ల వల్ల చిరకాల కోరిక తీరనుంది. ఈ రెండు రైల్వే లైన్ల నిర్మాణానికి రూ.7,526 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రైల్వే లైన్ సాంకేతిక, ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం జరుగుతోంది. ఎక్కడి నుంచి ఎక్కడకు లైన్లు వస్తాయి, ఎక్కడ రైల్వే స్టేషన్లు వస్తాయి? భూసేకరణ తదితర అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.



వికారాబాద్- కృష్ణాలైన్‌కు రూ.2,196 కోట్లు

ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి వికారాబాద్ మీదుగా రాయచూరుకు రైల్వే లైన్ ఉంది. ఈ దూరం దాదాపు 193 కిలో మీటర్లుగా ఉండగా.. వికారాబాద్ నుంచి కృష్ణా మీదుగా రైల్వేలైన్ మంజూరైతే 122 కిలోమీటర్లకు తగ్గనుంది. అలాగే హుబ్లీ, గోవా, కొల్హాపూర్ లాంటి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు దూరంభారం చాలావరకు తగ్గనుంది. ఈ రైల్వే లైన్ ప్రస్తుత అంచనాల ప్రకారం కొడంగల్, పరిగి, మక్తల్, నారాయణపేట మీదుగా కృష్ణాకు కలుస్తుంది. ఈ లైన్ ఫైనల్ లొకేషన్ సర్వేకు కేంద్రం ఆదేశించింది. దాదాపు రూ.2,196 కోట్లు అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. అలాగే కొడంగల్, పరిగి, తాండూరు ప్రాంతాల్లో సిమెంట్ ఫ్యాక్టరీల ఏర్పాటు, రవాణాకు ఈ లైన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానంగా తన దృష్టి కృష్ణా- వికారబాద్ రైల్వే లైన్‌పైనే ఉందని చెప్పారు. పెద్ద ఎత్తున పరిశ్రమలు స్థాపించి.. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలంటే ఈ రైల్వే లైన్ సాధించడంతోనే అవుతుందని చెప్పారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ఇతర కేబినెట్ మంత్రులను కలిసి దీనిపై విన్నవించారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి కూడా దీనిపై తమ ఫోకస్ ఉంటుందని ప్రకటించారు. ప్రస్తుతం ఎఫ్ఎల్ఎస్‌కు కేంద్రం ఓకే చెప్పడంతో అత్యంత వెనుకబాటులో ఉన్న ప్రాంతాలకు మేలు జరగనుంది. రైలు కూత ఎరగని ప్రాంతాలకు చాలా లాభం జరుగనుంది.

గద్వాల- డోర్నకల్‌కు రూ.5,330 కోట్లు..

దశాబ్దాల క్రితమే మాచర్ల-రాయచూరు రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఎన్నో ఉద్యమాలు చేయడంతో పాటు వినతులు సమర్పించారు. ఆ తర్వాత రాయచూరు నుంచి గద్వాల వరకు రైల్వేలైన్ పూర్తి చేయగా.. మిగతా లైన్‌కు గ్రహణం పట్టింది. సంవత్సరం క్రితం గద్వాల- మాచర్ల లైన్ అలైన్‌మెంట్ మార్చి.. గద్వాల- డోర్నకల్ రైల్వేలైన్‌గా నామకరణం చేశారు. ఫైనల్ లొకేషన్ సర్వేకు కేంద్రం రూ.7.40 కోట్లు కేటాయించింది. జనవరిలోనే ఆ ఫైనల్ లొకేషన్ సర్వే కూడా పూర్తయ్యింది. మొత్తం రూ.5,330 కోట్ల అంచనా వ్యయంతో 296 కిలోమీటర్ల మేర కొత్తలైన్ వేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అప్పటికే ఉన్న పాత అలైన్‌మెంట్‌ను కూడా పూర్తి చేసేందుకు ప్రయత్నించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అయితే కొత్త అలైన్‌మెంట్ ప్రకారం రైల్వే లైన్ వేయడం ద్వారా ఉత్తర తెలంగాణకు, దక్షిణ తెలంగాణకు కనెక్టివిటీ ఏర్పడుతుంది. హైదరాబాద్ నుంచి ఉన్న మార్గాన్ని వదిలేసి.. నేరుగా టైర్ 3 పట్టణాల్లో కూడా వ్యాపార విస్తరణకు అవకాశం ఏర్పడుతుంది. అలాగే దూరభారం భారీగా తగ్గే అవకాశాలు ఉంటాయి. ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలకు సులభంగా ప్రజలు ప్రయాణం చేయవచ్చు. ప్రస్తుతం గద్వాల నుంచి ఆరెపల్లి వరకు 7.8 కిలోమీటర్ల రైల్వే లైన్ ఉండగా.. అక్కడి నుంచి కొత్త అలైన్‌మెంట్ ప్రకారం భూత్పూరు, కడుకుంట్ల, వనపర్తి, గోపాల్‌పేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, నాంపల్లి, నల్గొండ, భీమవరం, సూర్యాపేట, మోతె, పాలేరు, కుసుమంచి మీదుగా డోర్నకల్ వరకు సాగుతుంది. దీనివల్ల ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన పట్టణమైన విజయవాడకు దూరం చాలావరకు తగ్గుతుంది. ఏపీ జిల్లాల వారు కర్ణాటకకు వెళ్లడానికి సులభమవుతుంది. అయితే ఈ ప్రాజెక్టు అనుకున్నప్పుడు రూ.1,000 కోట్ల అంచనా వ్యయం ఉండగా.. ఇప్పుడు అది రూ.5,330 కోట్లకు చేరింది. కానీ రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట కలిగించేలా ఈ పథకం మొత్తం ఖర్చును కేంద్రమే భరించనుంది. గతంలో 51 శాతం కేంద్రం, 49 శాతం రాష్ట్రం భరించాలనే నిబంధన లేదు. ఇప్పుడు కేవలం భూసేకరణ బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటే సరిపోనుంది. వచ్చే బడ్జెట్‌లో నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



ఉప్పునుంతల మండలం పెనిమిళ్లలో పత్తి మొలకలకు నీరు పోస్తున్న మహిళా రైతు

వాడిపోతున్న మొలకలు

- నాగర్‌కర్నూల్ జిల్లాలో తొలకరి వర్షాలకు మెట్ట పంటల సాగు
- 81,185 ఎకరాల్లో పత్తి
- విత్తనాలు వేశాక కురవని వర్షం
- ఆందోళనలో రైతులు

అచ్చంపేట, జూన్ 13: నాగర్‌కర్నూల్ జిల్లాలో ముందస్తు వానలకు వేసిన విత్తనాలు మొలకలు వచ్చి ఎండిపోతున్నాయి. మళ్లీ వర్షాలు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొలకల దశలోనే పరిస్థితి ఇలా ఉంటే మునుముందు ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో పత్తి సాగు అంచనా ఈ వానాకాలంలో 2,73,720 ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 81,185 ఎకరాల్లోనే సాగైంది. మొక్కజొన్నలు 3,027 ఎకరాల్లో, జొన్నలు 1,835, కందులు 456 ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకినప్పుడే జిల్లాలో కొద్దిపాటి వర్షాలు కురిశాయి. ఆ వానలకు రైతులు విత్తనాలు నాటారు. ఆ తర్వాత వర్షం రాకపోవడంతో మొలకలు ఎండుతున్నాయి. బోర్లు, బావులు ఉన్న వారు స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందించి, మొలకలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. విత్తనాలు మొలకెత్తని చోట మరికొందరు బిందెలతో నీరు తెచ్చి పోస్తున్నారు. వారం రోజులుగా రైతులు వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్, పదర మండలాల్లో కొంత మెరుగ్గా వర్షాలు కురవగా.. ఉప్పునుంతల, బల్మూర్, లింగాల, వంగూరు, అచ్చంపేట మండలాల్లో విత్తనాలు వేశాక మళ్లీ పడలేదు.




అచ్చంపేట మండలం సింగారంలో పత్తి మొలకలకు స్ప్రింక్లర్ల ద్వారా అందిస్తున్న నీరు

వర్షాలు రాకపోతే కష్టమే..

నేను నాలుగు ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటాను. వర్షం మాత్రం కురుస్తలేదు. మొలకలు ఎండిపోతుండటంతో స్ప్రింక్లర్లతో నీరు అందిస్తున్నా. రోజూ వాన కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. ఈ ఏడాది కూడా వర్షాలు సక్రమంగా కురుస్తాయో లేదో అన్న అనుమానం కలుగుతోంది.

- రేణయ్య, రైతు, సింగారం

పరుచుకున్న పచ్చదనం



తిరుమలయ్య గుట్టపై కమ్ముకున్న పొగమంచు



వర్షాలతో ఆకుపచ్చగా మారిన కొండలు



నీలం రంగులో కొండలు.. ఆకుపచ్చగా మారిన అడవి

ఇటీవల కురిసిన వర్షాలతో వనపర్తి జిల్లా కేంద్రంలోని తిరుమలయ్య గుట్ట ఆకుపచ్చగా మారింది. ఉదయం కమ్ముకున్న పొగమంచుతో ఆ ప్రాంతమంతా ఊటిని తలపిస్తుండగా.. మధ్యాహ్నం ఎండకు కొండలు వెండిలా మెరుస్తున్నాయి. సాయంత్రం వేళ రంగు రంగుల చీర కట్టినట్లు అందం రెట్టింపవుతోంది. చూపరులను ఆకట్టుకుంటున్న ఆ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' గురువారం క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

వరి విత్తనాల ధర పెరుగుదల

- బస్తాపై రూ.75 నుంచి రూ.100 వరకు
- కంపెనీని బట్టి రేట్లు



నారాయణపేట జిల్లా కేంద్రంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

నారాయణపేట, జూన్ 13: నారాయణపేట జిల్లాలో వానాకాలం వరి సాగుకు బోరు బావుల కింద రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే పెరిగిన వరి విత్తనాల ధరలు రైతులకు భారంగా మారుతున్నాయి. 20, 25, 30 కిలోల వరి విత్తనాల బ్యాగుల ధరలు కంపెనీని బట్టి రూ.75 నుంచి రూ.100 వరకు ధరలు పెరిగాయి. ఆర్ఎన్ఆర్ 20 కేజీల బస్తా ధర రూ.900 ఉండగా.. 25 కేజీలది రూ.1,100 ధర ఉంది. 1010 రకం 25 కేజీల బస్తా రూ. 900, హంస రకం 30 కేజీల బస్తా రూ.900, బీపీటీ 30 కేజీల బస్తా రూ.1,150 ఇలా ధరలు ఉన్నాయి. గతంలో ప్రభుత్వం విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు అందించేది. పదేళ్లుగా సబ్సిడీని ఇవ్వడం లేదు. కేవలం జీలుగ విత్తనాలను మాత్రమే సబ్సిడీపై ఇస్తున్నారు. దాంతో విత్తనాల కొనుగోలు రైతులకు ఆర్థిక భారంగా మారింది. ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు ఉన్నందున విత్తన ధరలు పెంచారని డీలర్లు అంటున్నారు.




విత్తనాలు సబ్సిడీపై అందించాలి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలను అందించి, ఆదుకోవాలని జిల్లా రైతులు కోరుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విత్తనాలపై సబ్సిడీని ఎత్తేసిందని, కేవలం పచ్చిరొట్ట ఎరువులు, జీలుగ విత్తనాలకే సబ్సిడీని పరిమితం చేసిందని అంటున్నారు. ఏటా పెరుగుతున్న విత్తనాల ధరలు ఆర్థిక భారంగా మారుతున్నాయని, అందుకే సబ్సిడీపై ఇవ్వాలని కోరుతున్నారు.

1.69 లక్షల ఎకరాల్లో సాగు..

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలంలో 4.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. అందులో 1.69 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని, అందుకు 42,250 క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని గుర్తించారు. యూరియా, కాంప్లెక్స్, పొటాష్ తదితర ఎరువులు 52,720 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది.



వరి పైరు(ఫైల్)

కోయిల్‌సాగర్‌ను పూర్తిగా నింపుతాం

- ఎమ్మెల్యేలు జీఎంఆర్, శ్రీహరి
- ప్రాజెక్టు నుంచి నీటి విడుదల





కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ద్వారా విడుదలవుతున్న నీరు; పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్‌పర్సన్

చిన్నచింతకుంట, జూన్ 13- దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిని పూర్తి స్థాయిలో నింపేందుకు కృషి చేస్తామని దేవరకద్ర, మక్తల్ ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి,జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డిలు అన్నారు. గురువారం మండలంలోని ఉంద్యాల గ్రామ సమీపంలో గల కోయిల్ సాగర్ ఫేజ్-1 పంప్‌హౌస్ వద్ద పూజలు చేసి, నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారానే రైతాంగానికి నీరు అందుతుందన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో ఏ ఒక్క ప్రాజెక్టునూ నిర్మించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగానే ప్రకృతి కూడా సహకరిస్తుందన్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయటం రైతులకు ఎంతో ఆనందాన్ని కల్గించిందన్నారు. ప్రస్తుతం రైతులు నారుమడులను సిద్ధం చేసుకునే సమయమని, త్వరలోనే రెండో మోటారు ద్వారా కూడా నీటిని విడుదల చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు అరవింద్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఖైమూద్, వెంకటేష్, నెల్సన్, జైపాల్‌రెడ్డి, మోయిన్, వట్టెం శివకుమార్, ప్రతాప్, గూడూరు శేఖర్‌లతో పాటు ఆయా మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

కారు అద్దాలు పగులగొట్టి రూ.3 లక్షలు చోరీ

నారాయణపేట, జూన్ 13 : నారాయణపేట జిల్లా కేంద్రంలోని సెంటర్ చౌక్‌బజార్‌లో పట్టపగలు ఆగిఉన్న ఓ కారులో ఉంచిన రూ. 3 లక్షల ఒక వేయి నగదు చోరీ అయిన ఘటన కలకలం రేపింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని కోస్గికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి నారాయణపేటలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో తన ఇంటి లోన్ చెల్లించేందుకు గురువారం తన బంధువు ఒకరిని వెంట పెట్టుకొని కారులో వచ్చాడు. బ్యాంకులో డీడీ తీయడానికి వీలు కాకపోవడంతో లోన్ ఇచ్చిన అప్టస్ అనే ప్రైవేటు బ్యాంకు వద్దకు వచ్చి బంధువుతో కలిసి లోపలికి వెళ్లాడు. కొంతసేపటి తర్వాత బయటకు వచ్చిన వారు కారు అద్దాలను పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఘటనా స్థలంలోని ఓ బంగారు దుకాణంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు బంగారు దుకాణంలో వెండిని కొనుగోలు చేస్తున్నట్లు నటించి కారు అద్దాలను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారని గుర్తించారు.

ఇంట్లో రూ.2 లక్షలు చోరీ

అచ్చంపేట టౌన్, జూన్ 13: ఇంటి తాళం పగులగొట్టి, రూ.రెండు లక్షలు దొంగిలించిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని సాయినగర్ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన రాజు తన భార్య కాన్పు కోసం హైదరాబాద్ వెళ్లడంతో నాలుగు నెలలుగా స్థానికంగా ఉండటం లేదు. బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు అతని ఇంటి తాళం పగులగొట్టి, బీరువాలో ఉన్న దాదాపు రూ.రెండు లక్షల నగదు అపహరించారు. బీరువాలోని దుస్తులు, వస్తువులు చిందరవందరగా పడేశారు. ఇల్లు తెరచుకొని ఉండటంతో స్థానికులు గమనించి ఎస్ఐకి సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వచ్చి ఇంటిని పరిశీలించారు. బాధితుడు రాజు హైదరాబాద్ నుంచి వచ్చి ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బిజినేపల్లి: మండలంలోని పాలెంలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దొంగలు నగదు, బంగారం దోచుకెళ్లారని బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు జగన్మోహన్ ఉదయం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాగా, తాళం విరగొట్టి కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా రెండు తులాల బంగారం, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



అశోక్‌రెడ్డి (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 13 : ఆర్థిక ఇబ్బందులతో అశోక్‌రెడ్డి(25) అనే యువకుడు ఉరి పెట్టుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ గురువారం తెలిపారు.

ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకా రం... నాగర్‌కర్నూల్ మండలంలోని బొంద లపల్లి గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డి అనే యువకుడు నాగర్‌కర్నూల్ పట్టణంలోని నాగనూల్ రోడ్డులో బ్యాడ్ బాయ్స్ అనే రెడీమేడ్ షాప నడుపుతున్నాడు.

షాపు సక్రమంగా నడవకపోవడంతో ఆర్థిక ఇబ్బందు లు తలెత్తాయి. దీంతో మనస్తాపానికి గురైన అశోక్‌రెడ్డి షాపులో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై తల్లి రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి

తిమ్మాజిపేట, జూన్ 13 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని పుల్లగిరి గ్రామపంచాయతీ పరిసర ప్రాంతాల్లో జింక గురువారం కుక్కల దాడిలో గాయపడి మృతి చెందింది. గ్రామ సమీపంలోని నర్సరీలో గాయపడిన జింకను చూసిన గ్రామస్థులు పశువైద్యాధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే జింక మృతి చెందిందని, విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు తీసుకెళ్లారని గ్రామస్థులు తెలిపారు. ఇంకా పరిసర ప్రాంతాల్లో ఎన్ని జింకలు మృతి చెందుతాయో తెలియదని జింకల వెనకాల సింహాలు, పెద్ద పులులు వచ్చే ప్రమాదం ఉందని భయంతో తాము ఆందోళనలో ఉన్నామన్నారు. అటవీ శాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, తమకు రక్షణ కల్పించాలని గ్రామస్థులు, చుట్టుపక్కల తండావాసులు పలువురు కోరుతున్నారు.



పుల్లగిరి నర్సరీలో కుక్కల దాడిలో మృతి చెందిన జింక

అప్రమత్తంగా ఉండాలి

చారకొండ, జూన్ 13: వర్షాకాలంలో వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మర్రిపల్లి స్పెషల్ అధికారిచి స్నహాస్సేన్ యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలో ని మర్రిపల్లిలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై గ్రామస్థులకు అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగ త శుభ్రతతో పా టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఇం టిముందర నీళ్లు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నా రు. వైద్యసిబ్బంది ప్రజలు అందుబాటులో ఉండి సేవ లు అందించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సారా, బెల్లం ఊట పట్టివేత

అమ్రాబాద్, జూన్ 13: అమ్రాబాద్ మండల పరిధిలోని మన్ననూరు, కొత్తపల్లి గ్రామాల్లో స్టేట్ టాస్క్‌ఫోర్స్, ఎస్‌హెచ్‌వో అచ్చంపేట ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. 15 లీటర్ల సారా, 400లీటర్ల బెల్లం ఊట స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్సు సీఐ శ్రీధర్, ఎస్‌హెచ్‌ఓ అచ్చంపేట సీఐ కృష్ణయ్య, ఎస్‌ఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

జూరాలకు కొనసాగుతున్న వరద



జూరాలకు వచ్చి చేరిన వరద నీరు

ధరూరు, జూన్ 13: జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఎగువన ఆల్మట్టి జలాశయంలో 24.68 టీఎంసీలు, నారాయణపూర్ జలాశయంలో 24.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల జలాశయంలో 317.202 మీటర్ల మేర, 6.768 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 6,673 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా నమోదు కాగా, 123 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో పోతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

కంటి పరీక్షలకే పరిమితం

- శస్త్ర చికిత్సలు శూన్యం
- జోగుళాంబ గద్వాల జిల్లా ఆస్పత్రిలో నిరుపయోగంగా పరికరాలు
- కంటి ఆపరేషన్లకు అవస్థలు పడుతున్న రోగులు



జిల్లా ఆస్పత్రిలో నిరుపయోగంగా ఉన్న కంటి ఆపరేషన్ల గది

గద్వాల న్యూటౌన్, జూన్ 13 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు జరగడం లేదు. అందుకు అవసరమైన పరికరాలు, యంత్రాలు రెండేళ్ల క్రితమే ఆసుపత్రికి వచ్చినా ఫలితం లేకుండా పోయింది. దీంతో లక్షల రూపాయల విలువైన పరికరాలు నిరుపయోగంగా ఓ గదిలో పడి ఉన్నాయి. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి కంటి పరీక్షల కోసం ప్రతి రోజు రోగులు వస్తూ ఉంటారు. వారికి కంటి పరీక్షలు చేస్తున్నా, అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేయడం లేదు. దీంతో వారు బయటి ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది.

రెండేళ్ల కిత్రం వచ్చిన పరికరాలు

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ల కోసం రెండు సంవత్సరాల క్రితం రూ. 70 లక్షల విలువైన సామగ్రిని ప్రభుత్వం సమకూర్చింది. శస్త్ర చికిత్సలు చేసేందుకు ప్రత్యేకంగా భవనాన్ని కూడా ఏర్పాటు చేశారు. అయినా శస్త్ర చికిత్సలు మాత్రం చేయడం లేదు. జిల్లా ఆసుపత్రికి ప్రతీ నెల కంటి పరీక్షల కోసం 600 నుండి 700 మంది వరకు వస్తుంటారు. ఇక్కడ ఆపరేషన్లు చేయకపోవడంతో, వారిలో ప్రతీ నెల దాదాపు 75 మంది వరకు మహబూబ్‌నగర్, హైదరాబాద్, కర్నూల్ పట్టణాల్లోని ఆసుపత్రులకు వెళ్తున్నారు. మరికొందరు జిల్లా కేంద్రంలోనే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకుంటున్నారు. జిల్లా ఆసుపత్రిలో అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉన్నా, భవనం అందుబాటులో ఉన్నా శస్త్ర చికిత్సలు ఎందుకు చేయడం లేదన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆపరేషన్ సామగ్రిని ఆసుపత్రిలోని ఓ గదిలో ఉంచారు. కొందరు సిబ్బంది వాటిని గుట్టు చప్పుడు కాకుండా అమ్ముకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నిరుపయోగంగా ఉన్న పరికరాలు

మహబూబ్‌నగర్‌లో చేయించుకున్నా..



కుల్లాయమ్మ, గద్వాల : గతంలో ఒక కంటికి మహబూబ్‌నగర్‌లోని రామిరెడ్డి ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నాను. ఇప్పుడు రెండో కంటికి అపరేషన్ చేయాలని డాక్టర్లు చెబుతున్నారు. ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయడం లేదు. మళ్లీ మహబూబ్‌నగర్‌కే వెళ్లాల్సి వస్తుంది. అధికారులు స్పందించి ఇక్కడే ఆపరేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



డాక్టర్ నవీన్‌క్రాంతి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి కంటి ఆపరేషన్లకు సంబంధించిన పరికరాలు, యంత్రాలు వచ్చిన మాట వాస్తవమే. సర్జరీల కోసం భవనం కూడా అందుబాటులో ఉంది. కానీ అందులో బాత్‌రూమ్, వాష్‌బేసిన్ల ఏర్పాటు వంటి చిన్న సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించాలని చెప్తున్నా కాంట్రాక్టర్ నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లాం. మెటీరియల్ ఉందని సిబ్బంది చెప్తున్నారు, మళ్లీ ఒకసారి వాటిని పరిశీలిస్తాను. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

స్కూల్ అసిస్టెంట్స్‌కు పదోన్నతి

- ఉమ్మడి జిల్లాలో 223 మందికి అవకాశం
- బదిలీలకు జాబితా సిద్ధం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 13 : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు జోన్-2 పరిధిలో 773 మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 223 మందికి పదోన్నతి లభించినట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఆన్‌లైన్ ఉత్తర్వులు అందిన వెంటనే జీహెచ్‌ఎంలు తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు ముగియడంతో స్కూల్ అసిస్టెంట్‌ల బదిలీలకు సంబంధించి సబ్జెక్టుల వారీగా సీనియార్టీ జాబితా సిద్ధం చేసి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే ఉపాధ్యాయుల నుంచి తీసుకుంటారు. ఆదేవిధంగా భాషా పండితుల సీనియార్టీ జాబితాలను కూడా ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో పదోన్నతులు, బదిలీలకు సంబంధించి విద్యాశాఖ అధికారి రవీందర్, సూపరింటెండెంట్, డీఈవో కార్యాలయం సిబ్బంది, సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

క్రీడలకు నెలవు మహబూబ్‌నగర్

- రూ.17కోట్ల 32 లక్షలతో మైదానాల అభివృద్ధి
- అందుబాటులోకి మల్టీపర్పస్, మినీ ఇండోర్ స్టేడియం
- పోతులమడుగులో తుది దశకు మినీ స్టేడియం పనులు



పోతులమడుగలో దాదాపు పూర్తయిన మినీ స్టేడియం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 13: జిల్లాలో క్రీడా రంగానికి బాటలు వేగంగా పడుతున్నాయి. జిల్లాలో ఎంతో మంది ప్రతిభ గల క్రీడాకారులు, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలో రూ.17కోట్ల 32లక్షలతో క్రీడా మైదానాలు అభివృద్ధి చేస్తున్నారు. రూ.2కోట్ల 50లక్షలతో ప్రధాన స్టేడియం ఆధునికీకరణ పనులు చేపట్టారు. రూ.6.99 కోట్లతో స్టేడియం మైదానంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం మైదానం గతేడాది అందుబాటులోకి తెచ్చారు. క్రీడాకారులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఇండోర్ కల నెరవేరింది. బాస్కెట్‌బాల్, షటిల్‌బ్యాడ్మింటన్, బాక్సింగ్, జూడో, టెబుల్ టెన్నిస్, నెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలు నిర్వహించుకోవచ్చు. ప్రేక్షకుల కోసం ఇండోర్ గ్యాలరీ రెండు వైపులా ఏర్పాటు చేశారు. త్వరలో రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీకి వేదిక కానుంది. ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో మైదానంలో రూ.2.65 కోట్లతో మినీ స్టేడియం మైదానం పనులు పూర్తి చేశారు. గతేడాది ప్రారంభించారు.

రూ.3.60 కోట్ల వ్యయంతో..

భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామంలో రూ.3 కోట్ల 60లక్షల వ్యయంతో చేపడుతున్న మరో మినీ స్టేడియం పనులు తుది దశకు చేరుకున్నాయి. బ్యాడ్మింటన్, షటిల్, టేబుల్‌టెన్నిస్, బాక్సింగ్ తదితర ఇండోర్ గేమ్స్ ఆడేలా స్టేడియంను తీర్చిదిద్దుతున్నారు. స్టేడియం అందుబాటులోకి వస్తే ఔత్సాహిక క్రీడాకారులు ఆసక్తి కనబరిచే అవకాశం ఉంది. దేవరకద్ర నియోజకవర్గంలోని ఆయా మండలాల క్రీడాకారులు సాధన చేసుకోవచ్చు. ప్రత్యేకంగా కోచ్‌లను నియమించి వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వవచ్చు.

పనులు త్వరలో పూర్తి చేస్తాం



దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మండలంలోని పోతులమడుగులో మినీ స్టేడియం పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల సహకారంతో త్వరలో అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. స్టేడియం నిర్మాణం పూర్తయితే క్రీడాకారులకు కోచ్‌ల పర్యవేక్షణలో మెరుగైన శిక్షణ లభిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చు.

- ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌వో

స్టేడియాలు అందుబాటులోకి రావటం సంతోషంగా ఉంది



మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాభివృద్ధిలో స్టేడియాల నిర్మాణాలు చేపట్టడం సంతోషంగా ఉంది. ఇప్పటికే ప్రధాన స్టేడియం ఆధునికీకరణ, మల్టీపర్పస్ స్టేడియం అందుబాటులోకి రావటం, ఎంవీఎస్‌లో మినీస్టేడియం రావటం క్రీడాకారులకు వరం. పోతులమడుగులో మరో స్టేడియం పనులు పూర్తయితే అక్కడి క్రీడాకారులు అక్కడే శిక్షణ పొందవచ్చు.

- శరత్‌చంద్ర, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి

విద్యార్థి శివసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మారుతి

అచ్చంపేట టౌన్, జూన్ 13: శివసేనా పార్టీ ఉమ్మడి మహబూబ్‌నగర్ విద్యార్థి సేన అధ్యక్షుడిగా మారుతి నియమితులయ్యారు. శివసేన పార్టీ కార్యాలయ సమావేశంలో భారతీయ విద్యార్థి సేన ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ తెలిపారు. రానున్న రోజుల్లో విద్యారంగ సమస్యలపైన పోరాటం చెయ్యాలని సూచించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేయాలని తెలిపారు. విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజు రియింబర్‌మెంట్ కోసం రాష్ట్ర ప్రభుత్వంపైన పోరాటం చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మారుతి మాట్లాడుతూ తనపైన నమ్మకంతో ఈ బాధ్యతను ఇవ్వడం ఎంతో సంతోషకరమన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. శివసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోయిలకొండ, జూన్ 13 : కూలి పని ముగించుకొని బైక్‌పై వస్తున్న వ్యక్తి కింద పడి మృతి చెందిన సంఘటన మండలంలోని మల్కాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాఘవేందర్ తెలిపిన వివరాల మేరకు.. మల్కాపూర్ గ్రామానికి చెందిన గొల్ల కోమటి హన్మంతు (44) ఇంటి నిర్మాణ కూలీ పని కోసం బుధవారం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా పారుపల్లి వద రాత్రి బైక్ అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతన్ని చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని తెలిపారు. మృతుని భార్య గొల్ల రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోయిలకొండ, జూన్ 13 : మండలంలోని చిన్నలింగాల్‌చేడ్‌లో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవేందర్ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకొంటామని హెచ్చరించినా వాగులో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ బైకని నర్సింములుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

పాలంలో కట్టేసిన ఎద్దులు అపహరణ

జడ్చర్ల, జూన్ 13 : జడ్చర్ల మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద కట్టేసిన రెండు ఎద్దులు కనిపించకుండా పోయాయంటూ బాధితుడు భాగం ప్రవీణ్ గురువారం జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామ శివారులోని తమ వ్యవసాయ పొలంలో ఈ నెల 12న సాయంత్రం రెండు ఎద్దులను కట్టేసి, వాటికి గడ్డిపెట్టి ఇంటికి వచ్చానని, తిరిగి గురువారం ఉదయం వెళ్లి చూసేసరికి లేవంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కనిపించకుండా పోయిన రెండు ఎద్దుల విలువ రూ.50వేలు ఉంటుందని పేర్కొన్నాడు. భాగం ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ చంద్ర మోహన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గండీడ్, జూన్ 13 : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జిన్నారంతండాలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిన్నారం తండాకు చెందిన కిషన్ నాయక్ అనే రైతు రోజు మాదిరిగా అడవిలో పశువులను మేత మేపి తన పొలం దగ్గర కట్టేసి వచ్చాడు. బుధవారం రాత్రి తాడు తెంపుకొని మేత కోసం వెళ్తున్న సమయంలో పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లగా దిమ్మెకు తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని, అధికారులు పరిశీలించి రైతుకు తగు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

కోడెదూడల పట్టివేత

అలంపూర్ చౌరస్తా, జూన్ 13 : అక్రమంగా తరలిస్తున్న కోడె దూడలను స్వాధీనం చేసుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులోని టోల్‌ప్లాజావద్ద గురువారం సాయంత్రం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గూడ్స్ వాహనంలో తరలిస్తున్న రెండు కోడెదూడలను గుర్తించారు. వీటిని జీన్ నుంచి నుండి హైదరాబాదులోని ఫలక్‌నూమా వద్దనున్న వధశాలకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. దీనికి బాధ్యులైన హైదరాబాదుకు చెందిన షేక్‌ఉమర్, వాహనం యాజమాని, కర్నూలుకు చెందిన షేక్‌మహబుబ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రెండు కోడెదూడలను తక్షశిల గోశాలకు అప్పగించారు.

నలుగురికి జైలు శిక్ష

కల్వకుర్తి, జూన్ 13 : మూడు దొంగతనం కేసుల్లో నలుగురికి జైలు శిక్ష, జరిమానాను న్యాయమూర్తి విధించినట్లు కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ కథనం ప్రకారం.... కల్వకుర్తి పట్టణంలో వెంకటేశ్వరస్వామి దేవాలయంలో నలుగురు వ్యక్తులు, హరిహర టౌన్‌షిప్‌లో ఇద్దరు వ్యక్తులు దొంగతనానికి పాల్పడగా వారిపై గతంలో ఉన్న ఎస్ఐ రమేష్ కేసులు నమోదు చేశారు. కల్వకుర్తి పట్టణం బలరాంనగర్‌కు చెందిన ఆంజనేయులు, స్వామి అలియాస్ సైదులు, శంకర్, శివప్రసాద్‌లు పట్టణంలో మూడు దొంగతనం కేసుల్లో పట్టుబడ్డారు. సీఐ బి.నాగార్జున ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ఆధారాలను కోర్టులో సమర్పించడంతో జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కావ్య ఒక్కొక్కరికి నాలుగు నెలల జైలు శిక్ష, జరిమానా విధించారని పేర్కొన్నారు. మొదటి కేసులో నాలుగు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా, రెండవ కేసులో పాల్గొన్న ఇద్దరికి నాలుగు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. మూడవ కేసులో ఒక్కొక్కరికి నాలుగు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అక్రమంగా మైనింగ్ చేస్తే చర్యలు



నర్సంపల్లిలో సీజ్ చేసిన బ్లాక్స్‌తో అధికారులు

ఊర్కొండ, జూన్ 13: అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మైనింగ్ శాఖ రాయల్టీ ఇనెస్పెక్టర్ నాగచైతన్య అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని నర్సంపల్లి శివారులోని పట్టా భూమి సర్వే నంబర్ 69, 70లో అక్రమంగా మైనింగ్ చేసిన 15 బ్లాక్స్‌ను మైనింగ్ రెవెన్యూ శాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా అక్రమంగా చేస్తున్న మైనింగ్ క్వారీ కొలతలు చేసిన అధికారులు అందులో ఉన్న 15 బ్లాక్స్ సీజ్ చేయడంతో పాటు మైనింగ్ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని అన్నారు. అనంతరం వారి ఆదేశాల మేరకు అక్రమంగా మైనింగ్ చేస్తున్న వారికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారి వెంట రెవెన్యూ గిర్దావరు సతీష్ చంద్ర తదితరులు ఉన్నారు.

రాయికుంటలో చేపలు మృతి



మృతి చెందిన చేపలు

గండీడ్, జూన్ 13 : మండల పరిధిలోని జక్లపల్లి గ్రామ శివారులోని రాయికుంటలో చేపలు మృతి చెందాయి. తిమ్మాయిపల్లి వెంకటయ్య ఆ కుంటలో చేపలు రెండేళ్లుగా పెంచుకునేవాడు. కుంటలో నీరు తగ్గినసమయంలో చేపలు పట్టి అమ్ముకుని జీవనం సాగించేవాడు. బుధవారం గుర్తు తెలియని వారు చేపలు ఉన్న గుంతలో విషం కలిపి ఉండవచ్చునని, అందుకే చేపలు అన్నీ మృతి చెందాయని బాధితుడు వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. గురువారం ఉదయం వెళ్లి చూడగా గుంతలో ఉన్న చేపలు మృతి చెందాయని తెలిపాడు. మత్స్య కార్మికుడికి రూ. లక్షా 50 వేల వరకు నష్టం వాటిల్లిందని, న్యాయం చేయాలని గ్రామస్థులు, బాధితుడు కోరారు.

రేషన్ బియ్యం, ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనం

కేటీదొడ్డి, జూన్ 13 : అనుమతి లేకుండా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని, ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీనివాస్ రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని పాతపాలెం సమీపంలో గురువారం తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ధరూర్ మండల కేంద్రానికి చెందిన వడ్డె రవి బోలెరో వాహనంలో 60 సంచుల్లో, దాదాపు 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రాయచూరుకు తరలిస్తుండగా పట్టుకున్నారు. అలాగే రాయచూరు జిల్లా కురవపూర్ గ్రామానికి చెందిన రాములు టాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి అభినందనలు



ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నవీన్ కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న బీఆర్ఎస్ పాలమూరు నాయకులు

మహబూబ్‌నగర్, జూన్ 13 : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో విజయం సాధించిన నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి గురువారం ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేశారు. గురువారం హైదరాబాద్‌లో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎదుట ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణితోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మాజీమంత్రులు మహమూద్‌అలీ, సబితాఇంద్రారెడ్డి, ఎస్.నిరంజన్‌రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ సురభివాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్య యాదవ్‌లు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు. షాద్‌నగర్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎంతో నమ్మకంతో తనకు ఓటు వేసి గెలిపించారని, స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తనను గెలిపించిన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులకు రుణపడి ఉంటానన్నారు. బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం కోసం తన వంతు పాత్ర పోషిస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు ఈట గణేష్, రవీందర్ యాదవ్, దేవేందర్ యాదవ్, ఒగ్గు కిశోర్, డోలి రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, పులిజాల నవీన్, శీలం శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జీఎంఆర్‌ను కలిసిన నాయకులు

భూత్పూర్, జూన్ 13 : దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఈనెల 12న అమెరికా నుంచి విదేశీపర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగివచ్చారు. గురువారం కాంగ్రెస్ భూత్పూర్ మండల నాయకులు హర్యానాయక్, ఆనంద్‌రెడ్డి, వేముల నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ ఊశన్న, రామకృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, దాసు తదితరుతు హైదరాబాద్‌కు వెళ్లి ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా నియోజవర్గంలో ఉన్న పలు సమస్యలపై నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు.

మూసాపేట నాయకుల సన్మానం

అడ్డాకుల : విదేశీ పర్యటనను ముగించుకొని వచ్చిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని ఆయన స్వగ్రామంలో గురువారం మూసాపేట మండల కాంగ్రెస్ నాయకులు కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం మహేందర్, తిరుపతయ్యగౌడ్, పలువురు గ్రామస్థులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డికి ఘన నివాళి

దేవరకద్ర, జూన్ 13 : దివంగత మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి నియోజకవర్గానికి చేసిన సేవలు మరువలేనివని నాయకులు ఆది హన్మంతురెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం దయాకర్‌రెడ్డి వర్ధంతి పురస్కరించుకొని మండల కేంద్రంలోని కొత్తబస్టాండ్ దగ్గర ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. వారు మాట్లాడుతూ దయాకర్‌రెడ్డి నిరుపేద ప్రజలకు ఎన్నో సేవలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊషన్న, రాజేశ్వర్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

పదోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులు

భూత్పూర్, జూన్ 13 : మండలంలోని వివిధ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఆరుగురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతులపై వెళ్లారు. ఈ సందర్భంగా వారికి గురువారం జిల్లా విద్యాశాఖ నుంచి ఆదేశాలు అందాయి. భూత్పూర్ యూపీ పాఠశాలలో (ఉర్దూ మీడియం) స్కూల్ అసిస్టెంట్ సోషల్ సబ్జెక్టు బోధిస్తున్న మీర్జాకరీముల్లా పదోన్నతిపై జీహెచ్ఎంగా నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఉర్దూ మీడియం)కు వెళ్లారు. అదే విధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూత్పూర్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కాళిదాస్ వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్ మండల కేంద్రంలో ఉన్న బాలుర హైస్కూల్‌కు బదిలీపై వెళ్లారు. కొత్తమొల్గర హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బాలకృష్ణారెడ్డి నాగకర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. కొత్తమొల్గర హైస్కూల్లో పని చేస్తున్న రాజశేఖర్ పదోన్నతిపై నారాయణపేట జిల్లా, నర్వ మండలంలో ఉన్న పాతర్‌చేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. పోతులమడుగు హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రతాప్‌రెడ్డి పదోన్నతిపై వికారాబాద్ జిల్లా కుదురుమల్లా హైస్కూల్‌కు వెళ్లారు. తాటికొండ హైస్కూల్లో పని చేస్తున్న శంకరాచారి బదిలీపై నారాయణపేట జిల్లా, మాగనూర్ మండలం నేరేడిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లారు.

ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

జడ్చర్ల, జూన్ 13 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ మొదటి ప్రాధాన్యం ఇస్తూ కిసాన్ సంక్షేమానికి సంబంధించిన ఫైల్‌పై తొలి సంతకం చేయడం హర్షించదగ్గ విషయమని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంటీ బాలకృష్ణ అన్నారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం జడ్చర్లలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు బుక్క నవీన్, మురళి, రాపోతుల శ్రీనివాస్‌గౌడ్, ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్, సామల నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్, నడిమింటి శ్రీనివాసులు, శేఖర్‌రెడ్డి, రామచంద్రయ్య, ప్రవీణ్, అమరనాథ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తండాలలో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలి

- బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్ రాజునాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మిడ్జిల్, జూన్ 13 : మండలంలోని అన్ని గిరిజన గ్రామ పంచాయతీలలో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని గురువారం బీజేపీ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు నరేష్ నాయక్ కోరారు. గిరిజన మోర్చా ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి మాట్లాడారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా చేసినా పూర్తి స్థాయిలో ప్రజలకు సేవలు అందడంలేదని అన్నారు. అనంతరం తహసీల్దార్ రాజునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లాలు, నాయకులు లక్పతినాయక్, శ్రీనునాయక్, శంకర్‌నాయక్, హనుమంతునాయక్, శ్రీకాంత్‌నాయక్, చంద్రశేఖర్, రమేష్‌నాయక్, చందునాయక్, మల్లేష్‌నాయక్, రమేష్, అరవింద్, యాదయ్య, నవీన్ ఉన్నారు.

ఓపెన్ పది, ఇంటర్ ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూన్ 13 : తెలంగాణ ఓపెన్ పది ఇంటర్ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. గత మేలో జరిగిన పరీక్షల ఫలితాలు విద్యాశాఖ అధికారుల విడుదల చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న మహబూబ్‌నగర్ జిలాలో పదో తరగతికి 47.63 శాతం, ఇంటర్‌లో 60.87 శాతం ఉత్తీర్ణత సాధించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పదో తరగతికి సంబంధించి 55.31, ఇంటర్ 56.15 శాతం ఉత్తీర్ణత సాధించారు. వనపర్తి జిల్లాలో పదో తరగతికి సంబంధించి 83.58 శాతం, ఇంటర్‌లో 57.14 శాతం, నారాయణపేట జిల్లాలో పదిలో 55.82 శాతం, ఇంటర్‌లో 43.62 శాతం ఉత్తీర్ణత సాధించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో పదో తరగతి 47.76 శాతం, ఇంటర్‌లో 50 శాతం ఉత్తీర్ణత సాధించారు. రీకౌంటింగ్, రీ వాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు 27 వరకు అవకాశం కల్పించినట్లు మహబూబ్‌నగర్ డీఈవో రవీందర్ తెలిపారు .

చే గువేరా జయంతి సందర్భంగా ఓపెన్ చెస్‌పోటీలు నేడు

పాలమూరు, జూన్ 13 : చే గువేరా 96వ జయంతి సందర్భంగా వీ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 14వ తేదీ జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో ఓపెన్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు యం.ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారుల నుంచి పెద్ద వారి వరకు ఎవరైనా స్త్రీ, పురుషులు, బాల, బాలికలు పాల్గొనవచ్చని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. చే గువేరా స్ఫూర్తితో అందరితో చెస్‌పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జిల్లా పరిషత్ పాలకమండలికి

ఇదే చివరి సమావేశం !

- కాంగ్రెస్ ప్రభుత్వంలో తొలి సమావేశం నేడు

మహబూబ్‌నగర్, జూన్ 13 : పల్లెల్లో సమస్యల పరిష్కారానికి వేదికగా ఉన్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగనుంది. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జడ్పీటీసీ, ఎంపీపీలు హాజరుకానున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇదే తొలి సమావేశం. మూడు నెలలుగా ఎన్నికల కోడ్ కారణంగా సమావేశం జరగలేదు. కాగా ప్రస్తుతం ఉన్న జిల్లా పరిషత్ పాలక మండలి ఇదే చివరి సమావేశం కావడం గమనార్హం. జూలై నాటికి ప్రస్తుత పాలకమండలి ఐదేళ్ల గడువు ముగియనుండటంతో దాదాపుగా ఇదే చివరి సమావేశం కానుంది. సభ్యులు సమస్యలపై ప్రశ్నిస్తారా ? లేదంటే ఐదేళ్ల తమ పాలనను మనన చేసుకుంటారా? అన్న చర్చ సాగుతోంది. అందులో ప్రభుత్వం మారడంతో జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు కొత్త ఎమ్మెల్యేలు వచ్చారు. వారంతా కాంగ్రెస్ పార్టీ నుంచే గెలుపొందారు. మహబూబ్‌నగర్ నుంచి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల నుంచి అనిరుధ్‌రెడ్డి, దేవరకద్ర నుంచి జి.మధుసూదన్‌రెడ్డి గెలుపొందారు. అదేవిధంగా ఎంపీగా బీజేపీ నుంచి డీకే అరుణ గెలుపొందారు. ఆమె ఇంకా ఎంపీగా ప్రమాణస్వీకారం చేయనందున అధికారిక కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం లేదు. ఇక స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి విజయం సాధించారు. ఇప్పుడు వీరంతా సమావేశానికి హాజరైతే సమావేశానికి కొత్తదనం రానుంది. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు స్వాగతం పలకడంతోపాటు సభ్యుల చివరి సమావేశం కావడంతో వారికి వీడ్కోలు సమావేశం కానుంది. ఇదివరకు జిల్లా పరిషత్ సమావేశం అంటే అధికార పక్షం, విపక్షం సభ్యుల మధ్య యుద్ధ వాతావరణమే కనిపించేది. ప్రస్తుత పాలకమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీతో పాటు సభ్యులంతా బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే కావడంతో సమావేశాలు సాదాసీదాగానే జరిగాయి. ఇటీవల ప్రభుత్వం మారడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వంలోకి వచ్చారు. సభ్యుల్లో కొందరు పార్టీ మారారు. ఇప్పుడైనా వాడీవేడిగా చర్చలు జరుగుతాయనుకుంటే ప్రస్తుతం పాలకమండలి గడువు ముగియనుండటం ఇదే దాదాపుగా చివరి సమావేశం కావడంతో ఈ సమావేశంలోనూ పరిచయాలతోనే సరిపెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



జిల్లా పరిషత్ కార్యాలయం

వ్యవసాయంపైనే ప్రధాన చర్చకు అవకాశం

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయం, విద్యుత్, మిషన్ భగీరథ, వైద్య, ఆరోగ్యం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, డీఆర్‌డీఏ, కార్పొరేషన్‌లతో 40 అంశాలపై చర్చించేందుకు ఎజెండాను రూపొందించారు. ఒకట్రెండు మించి మిగతా అంశాలను చర్చించే అవకాశం లేకపోవచ్చు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడం, వర్షాలు కురుస్తున్నందున రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని సభ్యులు చర్చించే అవకాశం ఉంది. విత్తన వడ్లకు డిమాండ్ దృష్ట్యా వాటిని రైతులకు అవసరమైన మేర సరఫరా చేయాలని సభ్యులు చర్చించే అవకాశం ఉంది. అదేవిధంగా విద్యుత్‌కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, లోఓల్టేజీ సమస్యలు పరిష్కరించాలని, వర్షాలు కురవడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున తాగునీటి పైపుల లీకేజీలు, నీటి గుంటల తొలగింపు, పారిశుధ్య పనులపై సభ్యులు ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. రూ.2 లక్షల రుణమాఫీ పైనా సభ్యులు సభలో చర్చించనున్నట్లు తెలుస్తోంది.

పెండింగ్ దరఖాస్తులు తక్షణమే పరిష్కరించాలి

- ధరణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించిన కలెక్టర్ రవి నాయక్

మహబూబ్ నగర్ (కలెక్టరేట్), జూన్ 13 : ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ జి. రవి నాయక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం నుంచి వెబెక్స్ సమావేశం నిర్వహించి ధరణి పెండింగ్ దరఖాస్తులు, మీసేవా, ప్రజావాణి, ఇసుక పెనాల్టీలు, డబుల్ బెడ్‌రూమ్ గృహాల కేటాయింపు తదితర అంశాలపై సమీక్షిస్తూ పలు సూచనలు చేశారు. ధరణి పోర్టల్ ద్వారా పెండింగ్ దరఖాస్తులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు అవసరమైతే ఎక్కువ సమయం కేటాయించి ముఖ్యంగా పాత దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో సర్వే వెరిఫికేషన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులు మండలాల వారీగా సమీక్షించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇసుక పెనాల్టీలపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో నవీన్, గనులు, భూగర్భ శాఖ ఏడి. సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.



వెబెక్స్ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ జి. రవినాయక్

ఆశ వర్కర్లకు పరీక్ష నిర్ణయం ఉపసంహరించుకోవాలి

- కలెక్టరేట్ ముందు ఆశ వర్కర్ల ధర్నాలో నాయకులు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్)/ పాలమూరు, జూన్ 13 : ఆశ వర్కర్లకు నష్టం కలిగించే పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రధాన ద్వారం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు నష్టం కలిగించే ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. గత ప్రభుత్వం నుంచి ఇచ్చిన హామీలు, ఇతరత్రా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆశ వర్కర్లు గిరిజన ప్రాంతాలలో గత 33 ఏళ్లుగా, మైదాన ప్రాంతంలో 19 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తు, ప్రభుత్వం నిర్వహిస్తున్న అనేక ట్రైనింగ్‌లు పొందామని అన్నారు. రిజిస్టర్లు రాయడం మొదలు కొని ఆన్‌లైన్‌లో పని చేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర అన్ని రకాల జబ్బులను గుర్తించి, ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నామని తెలిపారు. కరోనా కాలంలో ఆశలు కీలక పాత్ర పోషించామని వారు గుర్తు చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని అవార్డును ప్రకటించిందని గుర్తు చేశారు. ఇన్ని పనులు నిర్వహిసస్తూ, ఇంత సీనియారిటీ ఉన్నప్పటికీ మళ్లీ కొత్తగా ఎగ్జామ్స్ పెట్టడం ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు కురుమూర్తి, రాజ్‌కుమార్, తిరుమలయ్య, యాదమ్మ, సాధన, మహిదా, పద్మ, విమల పాల్గొన్నారు.



కలెక్టరేట్ ప్రధాన ద్వారం ముందు ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

'కల్యాణ లక్ష్మీ'ని వెంటనే మంజూరు చేయాలి

- ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి డిమాండ్

గండీడ్, జూన్ 13 : కల్యాణ లక్ష్మీ నిధులు వెంటనే మంజూరు చేయాలని ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలంలో నిర్వహించిన ఉమ్మడి మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. కల్యాణ లక్ష్మికి అర్హత ఉన్నా సమయానికి అందడంలేదని, సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి వెంటనే మంజూరు చేయాలని తహసీల్దార్ నాగలక్ష్మిని కోరారు. మొదటి మ్యారేజ్ సర్టిఫికెట్‌ను ఎవ్వరు ఇవ్వాలని గ్రామ కార్యదర్శులు, తహసీల్దార్‌లపై సందిగ్ధంగా మారిందని, గతంలో కల్యాణలక్ష్మి ఎలా మంజూరి చేసేది ఇప్పుడు ఎందుకు డిలే చేస్తున్నారని ఎంపీటీసీలు అధికారులను నిలదీశారు. వెంటనే ఈ విషయంపై ఆర్డీవోకు నివేదిక ఇవ్వనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. గ్రామాల్లో ముఖ్యమైన సమస్యలుంటే వెంటనే కార్యదర్శులు, గ్రామాల ప్రత్యేకాధికారులు తమ దృష్టికి తీసుకరావాలని తెలిపారు. ప్రతీ గ్రామానికి 10వేల మొక్కలు నాటాలని ఏపీవో కోరారు. గ్రామంలో ఐదు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి గ్రామ చివరలో ఎలాంటి మురుగు నీరు లేకుండా చూడాలని తెలిపారు. మిషన్ భగీరథ నీటిపై ఇంటింటి సర్వే చేస్తారని తెలిపారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఎవ్వరూ పట్టించుకోరా అని ఎంపీటీసీలు వాపోయారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, వైస్ఎంపీపీ ఈశ్వరయ్య గౌడ్, తహసీల్దార్ నాగలక్ష్మి, మహమ్మదాబాద్ డిప్యూటీ తహసీల్దార్ యాదయ్య, ఎంపీవో శంకర్‌నాయక్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



గండీడ్ మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మాధవి

భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవాబ్‌పేట, జూన్ 13 : అనేక ఏళ్లనుంచి సాగు చేసుకొని బతుకుతున్న భూములను తమకు తెలియకుండా ఇతరులకు అమ్ముకోవడం సరికాదని పలువురు రైతులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే... మండల కేంద్రమైన నవాబ్‌పేట, యన్మనగండ్ల మధ్యలో రంగారావుకు చెందిన 12 ఎకరాల భూమిలో నవాబ్‌పేటకు చెందిన 12మంది రైతులు అనేక ఏళ్లుగా సాగుచేసుకొని జీవనం గడుపుతున్నారు. ఉన్నట్లుండి ఆ భూమిని హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రంగారావు తరఫున వచ్చిన రవి అనే వ్యక్తి అమ్మాడు. దీంతో రెండు మూడు రోజులుగా హైదరాబాద్‌కు చెందిన వారు ఆ భూమిని సర్వే చేయిస్తుండగా, ఇన్నాళ్ల కాస్తులో ఉన్న రైతులు అడ్డుకొని గురువారం మరికంటి నర్సింములు, పుట్టి శ్రీనివాస్, మరికొందరు రైతులు ధర్నాకు దిగారు. కాంగ్రెస్ నాయకులు కొల్లి నర్సింహ, అంజన్‌కుమార్ యాదవ్, సత్యం, పుట్టి అంజయ్య, కోట్ల రాజేష్, మర్కంటి నర్సింహులు, తిరుపతయ్య, శివకుమార్, ఆనంద్, నర్సింహులు, సత్యం, మైనుద్దీన్ ఆందోళన కారులకు మద్దతు తెలిపారు. అధికారులు విచారణ చేసి, న్యాయం చేయాలని కోరారు.



ధర్నాకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రభుత్వ పాఠశాలలను విస్మరించరాదు

- మద్దిగట్లలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసిన నాయకులు

భూత్పూర్, జూన్ 13 : ప్రైవేటు పాఠశాలల మోజులో పడి మన ఊరిలో ఉన్న ప్రభుత్వ బడిని విస్మరించరాదని, ప్రభుత్వ బడుల్లోనే అను భవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మద్దిగట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం దుస్తులు, పాఠ్యపుస్తకాలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎంపీపీ పంపిణీ చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ బడుల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నదని కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిష్టప్ప,నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, రాంరెడ్డి, జంగిరెడ్డి, రాఘవరెడ్డి, ఉపాధ్యాయులు బాలరాజుగౌడ్, సురేందర్, బాలచంద్రుడు, అన్నపూర్ణ, జ్యోతి, రేవతి పాల్గొన్నారు.



మద్దిగట్లలో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేస్తున్న నాయకులు

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి : ఎంఈవో

అడ్డాకుల : తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తూ విద్యార్థులు ఉన్న తంగా ఎదగాలని ఎంఈవో నాగయ్య అభిలషించారు. గురువారం అడ్డాకుల మండల పరిధిలోని గుడిబండలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఈ సందర్భంగా ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్‌బుక్‌లను అందజేశారు. అదేవిధంగా పొన్నకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి అధ్యక్షతన ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్‌బుక్‌ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీఎం సుధీర్, ఎంపీటీసీ శకుంతల, హెచ్ఎం, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీధర్‌గౌడ్, శివకుమార్, ఏఏసీచైర్‌పర్సన్‌లు బాలీశ్వరమ్మ, పుష్ప, వెంకటమ్మవిద్యార్థులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

ఆస్తిపన్ను, అద్దెలు వసూలు చేయండి

- అధికారులను ఆదేశించిన మునిసిపల్ కమిషనర్

మహబూబ్‌నగర్, జూన్ 13 : పురపాలిక ఆదాయం పెంచుకునే విషయంపై దృష్టి సారించాలని మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పురపాలికలో ఆస్తిపన్ను తక్కువగా వసూలు కావడం, అద్దె దుకాణాల అద్దె కోట్లల్లో పెండింగ్‌లో ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం తన చాంబర్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆస్తిపన్ను చెల్లింపులపై దృష్టి సారించాలని, బకాయి ఉన్నవారికి నోటీసులు జారీ చేసి వసూలు చేయాలని సూచించారు. అదే విధంగా అద్దె పెండింగ్ ఉన్న మునిసిపల్ దుకాణదారులకు నోటీసులు ఇచ్చి అద్దెలు వసూలు చేయాలని, ఈ విషయంలో సీరియస్‌గా వ్యవహరించాలని పేర్కొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ

కోయిలకొండ, జూన్ 13 : మండలంలోని తిర్మలంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి నిధుల మంజూరుకు హామీ ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా పాఠశాలను మరమ్మతులు చేపట్టడం జరిగిందని, పాఠశాల ప్రహరీ నిర్మాణం కూడా చేపట్టేందుకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యల గురించి ఎమ్మెల్యేకు విన్నవించగా వెంటనే పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారని తెలిపారు.

జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా సాయిలు, సురేందర్‌బాబు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 13 : మహబూబ్‌నగర్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా సాయిలు, సురేందర్‌బాబు నియమితులయ్యారు. ఇటీవలే గద్వాలలో జరిగిన ఉమ్మడి జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్‌బాడీ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీహరి నియామకపత్రం అందజేసినట్లు ప్రధాన కార్యదర్శి సురేందర్ బాబు తెలిపారు. రెండో సారి తనకు ప్రధాన కార్యదర్శి అవకాశం కల్పించడం పట్ల రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అడ్డాకుల, జూన్ 13 : అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త గొల్ల రామచంద్రయ్య బ్రెయిన్ స్ట్రోక్‌తో గురువారం చనిపోవడంతో కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సూచనలతో కాంగ్రెస్ మండల నాయకులు, ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండా జగదీశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట శ్రీహరి, జిల్లా కార్యదర్శి గంగుల విజయమోహన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శరత్‌కుమార్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, దశరథ్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, సాయిరెడ్డి, వేగనాథ్, పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ ప్రేమ్‌కుమార్‌లు గొల్ల రామచంద్రయ్య మృతదేహానికి నివాళి అర్పించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సాయం అందజేశారు.

కేజీబీ పాఠశాలకు కుర్చీల బహూకరణ

మిడ్జిల్, జూన్ 13 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన లావణ్య భర్త దామోదార్‌రెడ్డి జ్ఞాపకార్థంగా, ఆమెకుమారులు జస్వంత్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డిలు కుర్చీలను అందజేశారు. దామోదర్‌రెడ్డి జయంతి సందర్భంగా ప్రతీ సంవత్సరం సేవా కార్యక్రమాలు చేపడుతామని, అందులో భాగంగానే కుర్చీలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేజీవీబీ సిబ్బంది తదితరులున్నారు.

'గోవులను వధించకుండా చర్యలు తీసుకోవాలి'

జడ్చర్ల, జూన్ 13 : బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను వధించకుండా చర్యలు తీసుకోవాలంటూ విశ్వహిందూ పరిషత్ సభ్యులతో పాటు వివిధ క్షేత్రాల సంఘం సభ్యులు గురువారం జడ్చర్ల సీఐ ఆదిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గోవుల అక్రమ రవాణాను నివారించాలని కోరారు. అలాగే జడ్చర్ల తహసీల్ కార్యాలయం, మునిసిపల్ కార్యాలయాలలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో జగ్‌పాల్‌రెడ్డి, నవీన్, నరేశ్, నాగరాజుఉన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

నవాబ్‌పేట, జూన్ 13 : హైదరాబాద్‌లో ఉన్న కూతురును చూసేందుకు వెళ్లిన ఓ మహిళ రైల్వే గేటు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందిన సంఘటన హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా ప్రాంతంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం... మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామానికి బడగుల కిష్టమ్మ(62) తన కూతురు సత్యమ్మను చూసేందుకు గురువారం ఉదయం ఇంటినుంచి బయలుదేరి హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా సమీపంలో మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో రైల్వే పట్టాలు దాటుతుండగా రైలు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో కిష్టమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఆమె వద్ద ఉన్న ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు గుర్తించి పోలీసుల సూచన మేరకు ఫిర్యాదు చేయడంతో రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కిష్టమ్మ మృతి పట్ల గ్రామస్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవాబ్‌పేట, జూన్ 13 : మండలంలోని తీగలపల్లి, కారుకొండ గ్రామాల్లోని సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతులో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు 33 కేవీ పోలేపల్లి ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో కారుకొండ, కాకర్లపాడ్, తీగలపల్లి, రుద్రారం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ టి.సంతోష్ కుమార్ గురువారం తెలిపారు. అలాగే ఇప్పటూర్, కూచూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని కూచూర్, దొడ్డిపల్లి, హన్మసానిపల్లి, మల్లారెడ్డిపల్లి, చెన్నారెడ్డిపల్లి, కారూర్, గోపోనిపల్లి గ్రామాలకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ అంతరాయానికి మండల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చిరుత దాడిలో యువకుడికి గాయాలు

నవాబ్‌పేట, జూన్ 13 : చిరుత దాడిలో ఓ యువకుడు గాయపడిన సంఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన పెంటల శేఖర్ రాత్రి 9 గంటల ప్రాంతంలో బహిర్భూమికి గ్రామ సమీపంలోకి వెళ్లగా చెట్ల పొదల మాటున ఉన్న చిరుత శేఖర్‌పై దాడి చేసి చేతిపై గాట్లు వేసింది. దీంతో కేకలు వేసుకుంటూ గ్రామంలోకి రావడంతో అందరూ కలిసి ఘటన స్థలానికి వెళ్లి చూడగా చిరుత పారిపోయింది. గాయపడ్డ శేఖర్‌ను జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. చిరుత గ్రామ సమీపంలోకి రావడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.